క్లుప్తంగా

పాఠశాల పరిశీలన



మరుగుదొడ్లు పరిశీలిస్తున్న ఎంఈవో అప్పలరాజు

కోటబొమ్మాళి: మండలంలోని పాకివలస ప్రాథమిక పాఠశాలను ఎంఈవో-1 సంపతి రావు అప్పలరాజు సోమవారం పరిశీలించారు. పాఠశాలలో విద్య, జగనన్న గోరుముద్ద, మరుగుదొడ్ల నిర్వహణ తదితర అంశాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం పార్వతీశం, విద్యా కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్లు దండాసి సింహాచలం, ఎస్.మురళి పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదులకు సత్వర పరిష్కారం



వినతులు స్వీకరిస్తున్న తహసీల్దార్ పాపారావు

మందస: ప్రతి సోమవారం నిర్వహించే స్పందనలో వచ్చే ఫిర్యాదులకు సత్వర పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ బడే పాపారావు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు స్పందన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతు సంఘాల నాయకులు పలు సమస్యలను అధికారులకు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి జి.నాగరాజు, హౌసింగ్ ఏఈ గార రామ్మోహనరావు, సీఎస్‌డీటీ శానాపతి రవికుమార్, ఈవోపీఆర్డీ కె.జయప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం అందిస్తున్న సేవా సమితి సభ్యులు

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని సన్యాసిపుట్టుగ గ్రామానికి చెందిన నీలాపు కేదారి కిడ్నీవ్యాధితో ఇటీవల మృతి చెందాడు. ఇంటి యజమాని ఆకస్మికంగా మృతి చెందడంతో ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడుతోంది. దీంతో కేశుపురం గ్రామానికి చెందిన కాళీమాత సేవా సమితి సభ్యులు స్పందించి రూ.10 వేల ఆర్థిక సాయంతో పాటు నిత్యావసర సరుకులు సోమవారం అందజేశారు.

ట్యాబ్‌లు సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థిని ట్యాబ్‌ను పరిశీలిస్తున్న ఎంఈవో అప్పారావు

ఇచ్ఛాపురం రూరల్: ప్రభుత్వం అందించిన ట్యాబ్‌లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో కురమాన అప్పారావు సూచించారు. మండలంలోని మండపల్లి ఉన్నత పాఠశాలను సోమవారం సందర్శించి ట్యాబ్‌ల వినియోగంపై ఆరా తీశారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక తరగతులు, కృత్యాలు ద్వారా బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ సందర్భంగా జగనన్న గోరు ముద్దు మధ్యాహ్న భోజనంను పరిశీలించారు. అనంతరం బుద్దేవుపేట ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న మనబడి నాడు-నేడు పనులను పర్యవేక్షించి, నాణ్యతతో కూడిన మెటీరియల్ వాడాలని స్పష్టం చేశారు. ఆయనతో పాటు హెచ్ఎం జాడు ప్రకాశరావు, ఎ.శ్రీనివాసరావు, సీఆర్పీ దేవరాజు ఉన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

సంతబొమ్మాళి: మండలంలోని నౌపడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జెమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. నౌపడ సర్పంచ్ పిలక బందాదేవి కార్యక్రమాన్ని ప్రారంభించారు. శిబిరంలో 250 మందికి కళ్లు, బీపీ, షుగర్, గుండెకు సంబంధించిన వ్యాధుల పరీక్షలు నిర్వహించారు. 25 మందిని కంటి పరీక్షల నిమిత్తం జెమ్స్ ఆస్పత్రికి రిఫర్ చేశారు. నౌపడ, సీతానగరం గ్రామాల నుంచి పలువురు హాజరయ్యారు. విద్యా కమిటీ చైర్మన్ లింగరాజు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ
- సోంపేటలో గడప గడపకూ మన ప్రభుత్వం



లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న దృశ్యం

సోంపేట: వైఎస్సార్‌సీపీ హయాంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ నిష్పక్షపాతంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. సోంపేట సచివాలయం-1 పరిధిలో వైఎస్సార్‌సీపీ ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి గత నాలుగేళ్లుగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకొని, పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సమస్యల పరిష్కారానికి పెద్దపీట వేస్తున్నారన్నారు. అనునిత్యం ప్రజా సంక్షేమానికి కృషి చేస్తున్న ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్, రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వర్ రెడ్డి, కంచిలి ఎంపీపీ పైల దేవదాస్ రెడ్డి, సోంపేట సర్పంచ్ నగిరి ప్రభావతి, ఉప సర్పంచ్ ఎం.వెంకటరమణ, సుంకిడి సర్పంచ్ ఎస్.భాస్కరరావు, ఎంపీటీసీలు పొడుగు కామేష్, ధర్మారావు, పార్టీ నాయకులు నెహ్రూ, ధర్మారావు, వెంకన్న, భీమారావు, డి.శ్రీను, ఈపరి రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న దువ్వాడ వాణి తదితరులు

- దువ్వాడ వాణి
- పలు గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం

టెక్కలి: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి అన్నారు. మండలంలోని ముఖలింగాపురం పంచాయతీ పరిధి ముఖలింగాపురం, చిరుతునాపల్లి, బెండకాయలపేట తదితర గిరిజన గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతీ గిరిజన కుటుంబాన్ని పలకరిస్తూ గడచిన నాలుగున్నరేళ్ల పాలనలో అందుకున్న సంక్షేమ పథకాలను వివరించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా గిరిజన గ్రామాల్లో అభివృద్ధి చేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనని గుర్తు చేశారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికీ ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందేవిధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నవరత్నాలకు రూపకల్పన చేశారన్నారు. మంచి చేస్తున్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.రాకేష్, వైస్ సర్పంచ్ జి.ఆనంద్, సర్పంచ్‌లు ఆర్.జయమోహన్, జి.మోహన్‌రెడ్డి, ఎం.శంకర్, కె.కామేష్, నాయకులు పి.వీరవసంత్, ఎం.భాస్కర్, కె.చిన్నారావు, జగన్, జె.చంద్రరావు, జి.అప్పలరెడ్డి, బి.రామకృష్ణ, ఎ.రాహుల్, టి.లోకేష్, పి.శ్రీను, బి.రాజేష్, బుసకల శ్రీను, వి.ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి లంపిస్కిన్ నిరోధక టీకాలు

- పశు సంవర్థక శాఖ టెక్కలి డీడీ జయరాజ్



డీడీ జయరాజ్

టెక్కలి: పశువుల్లో లంపిస్కిన్ (ముద్ద చర్మపు) వ్యాధి రాకుండా ముందస్తుగా మంగళవారం నుంచి లంపిస్కిన్ నిరోధక టీకా కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు పశు సంవర్ధక శాఖ టెక్కలి డీడీ వి.జయరాజ్ వెల్లడించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. గతేడాది ఆవుజాతి పశువుల్లో లంపిస్కిన్ వ్యాపించి పాడి రైతులకు ఎంతో భయాందోళన కలిగించిందన్నారు. దీనిపై ప్రభుత్వం స్పందించి వ్యాధి నిరోధక టీకాలను సరఫరా చేసినట్లు వెల్లడించారు. టెక్కలి డివిజన్ పరిధిలో ప్రధానంగా ఒడిశా సరిహద్దుకు ఆనుకొని ఉన్న మెళియాపుట్టి, పాతపట్నం, మందస, కంచిలి, ఇచ్ఛాపురం ప్రాంతాల్లో ప్రాధాన్యత క్రమంలో 3 నెలల దాటిన దూడల నుంచి ఆరంభించి, మిగిలిన ఆవుజాతి పశువులకు ఈ వ్యాక్సిన్లు వేస్తారని పేర్కొన్నారు. మొత్తం 193 మంది సిబ్బందితో సుమారు 1 లక్షా 94 వేల వ్యాక్సిన్లు వేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. పాడి రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం నిర్వహిస్తున్న ఇటువంటి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నెల రోజుల పాటు వ్యాధి నిరోధక టీకాలు వేయనున్నట్లు పేర్కొన్నారు.

కిడ్నీవ్యాధితో యువకుడు మృతి



సంతోష్ (ఫైల్)

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని ఒంకులూరు గ్రామానికి చెందిన యువకుడు సండుపల్లి సంతోష్ (35) కిడ్నీవ్యాధితో బాధపడుతూ సోమవారం మృతి చెందారు. మృతుడు కూలీ పనులు చేసుకొని కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉంటూ గత రెండేళ్లుగా విశాఖపట్నంలో డయాలసిస్ చేసుకుంటున్నాడు. మృతినికి భార్య రేణుక, తండ్రి బైరాగి, తల్లి కస్తురమ్మ ఉన్నారు. యువకుడి మృతిపై సర్పంచ్ లింగాల సంధ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు జోగి అప్పారావు, ఎస్.మోహన్, గ్రామ పెద్దలు సంతాపం తెలియజేశారు.

ప్రభుత్వ ఆస్పత్రికి స్ట్రెచర్ వితరణ



స్ట్రెచర్ అందిస్తున్న పీసీఎంఏ కమిటీ సభ్యులు

కాశీబుగ్గ: పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి పలాస కాష్యూ మ్యాన్యుఫ్యాక్చర్ ఆసోసియేషన్ సభ్యులు స్ట్రెచర్‌ను వితరణగా అందజేశారు. సోమవారం ఆస్పత్రి వద్దకు తీసుకొచ్చి ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ డబ్బీరు భవానీశంకర్, సూపరింటెండెంట్ డాక్టర్ మేఘనలకు అందించారు. కార్యక్రమంలో పీసీఎంఏ అధ్యక్షుడు మల్లా సురేష్‌కుమార్, డాక్టర్ ఉంగ కిరణ్‌కుమార్, కౌన్సిలర్ సవర సోమేశ్వరరావు, సవర మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

ఇచ్ఛాపురం రూరల్: విద్యార్థులు క్రీడల్లో రాణించాలని రూరల్ ఎస్ఐ ఎన్.రమేష్ అన్నారు. స్థానిక ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పోలీసు స్టేషన్‌లో క్రికెట్ కిట్‌ను సోమవారం అందించారు. విద్యార్థులు క్రీడలపై ఆసక్తి పెంచుకునేందుకు ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు.

'ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి'

పలాస: మండలంలోని మాకన్నపల్లి గ్రామానికి చెందిన మృతుడు సైని సింహాచలం కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ జీడి రైతు సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన జీడి రైతాంగ నాయకులతో కలిసి పలాస ఆర్డీవో సీతారామ్మూర్తికి సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సింహాచలం అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకున్నాడని, అతని కుటుంబాన్ని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో రైతు సంఘం కో-కన్వీనర్ అంబటి రామకృష్ణ, సీఐటీయూ నాయకుడు ఎన్.గణపతి, జీడి రైతులు తదితరులు పాల్గొన్నారు.

దాతల ప్రోత్సాహం అభినందనీయం



విజేతలకు నగదు ప్రోత్సాహం అందజేస్తున్న వెంకటరమణ

కవిటి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు దాతలు అందిస్తున్న ప్రోత్సాహకాలు అభినందనీయమని వక్తలు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ముగ్గురు విద్యార్థులకు ప్రగడ బుచ్చమ్మ కల్యాణీ మెమోరియల్ స్కాలర్ షిప్స్‌ను స్థానిక జీజే కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ ప్రగడ వెంకటరమణ సోమవారం అందజేశారు. ప్రతీఏటా మాదిరిగానే రానున్న విద్యా సంవత్సరంలోనూ ప్రోత్సాహకాలు అందజేస్తానని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

'పంచాయతీల ఆదాయం పెంచుకోవాలి'

నందిగాం: చెత్త నుంచి సంపద సృష్టించి పంచాయతీల ఆదాయాన్ని పెంపొందించుకోవాలని డివిజినల్ లెవల్ పంచాయతీ అధికారి ఐవి.రమణ సూచించారు. మండలంలోని వల్లభరాయునిపాడులో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. చెత్త సేకరించే విధానం గురించి పంచాయతీ కార్యదర్శులు రామానాయుడు, నంద కిషోర్‌లను అడిగి తెలుసుకున్నారు. అలాగే తడి, పొడి చెత్తలను వేరుచేయు విధానం, చెత్త నుంచి వర్మీ కంపోస్టు తయారీ విధానాన్ని వివరించారు. వర్మీ కంపోస్టును రైతులకు విక్రయించి ఆదాయం పొందవచ్చని తెలిపారు. అనంతరం కేంద్రం ఆవరణలో కొబ్బరి మొక్కలు నాటారు. కార్యక్రమంలో సర్పంచ్ మళ్ల సీతారాం, వీఏఏ విఘ్నేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జంట పట్టణాల్లో అత్యుత్తమ వైద్య సేవలు



వార్షికోత్సవ వేడుకల్లో డాక్టర్ వినోద్‌కుమార్ తదితరులు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో ఏడాది కాలంగా ఏవీ మెడికేర్ ఆస్పత్రి అత్యుత్తమ వైద్య సేవలు అందిస్తోందని డాక్టర్ కణితి వినోద్‌కుమార్ అన్నారు. కాశీబుగ్గ సబ్ రిజిస్టర్ కార్యాలయం ఎదురుగా ఉన్నటువంటి ఈ ఆస్పత్రిలో ప్రథమ వార్షికోత్సవ వేడుకలు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఆస్పత్రిలో డాక్టర్ అశ్విని సంపతిరావు స్త్రీ ప్రసూతి సేవలు అందిస్తున్నారని, అలాగే దీర్ఘకాలిక కీళ్ల నొప్పులు, కాళ్ల తిమ్మిర్లు, సయాటిక, నడుము నొప్పి, విరిగిన ఎముకలు, వంకర కాళ్లు, పీవోపీ కట్టుతో నయం చేస్తామన్నారు. అదేవిధంగా కీ హోల్, కీళ్ల మార్పిడి శస్త్ర చికిత్స చేయనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హనుమంతు వెంకటరావుదొర, తమ్మినాన శాంతారావు, తులసీరావు తదితరులు హాజరయ్యారు.

• మర్యాదపూర్వక భేటీ



మండలంలోని కొత్తపుట్టుగలో ఎమ్మెల్సీ నర్తు రామారావును ఆయన స్వగృహంలో విశ్రాంత డీఎస్పీ ఎస్‌వీవీ ప్రసాదరావు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దుశ్శాలువతో సత్కరించి పుష్పగుచ్ఛాన్ని అందించారు. ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని యాదవ సామాజిక వర్గానికి సముచిత ప్రాధాన్యం దక్కడం ఆనందకరమన్నారు.

- కవిటి

• తిరుమలలో గీతాలాపన



తిరుమల తిరుపతి దేవస్థానంలో టెక్కలికి చెందిన వేంకటేశ్వర మహిళా భక్త మండలి ఆధ్వర్యంలో గీతాలాపన(పాటల కచేరి) కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఏపీ కళింగ కోమటి కార్పొరేషన్ డైరక్టర్ టంకాల పావనీరాణి ఆధ్వర్యంలో సుమారు 60 మంది ఆధ్యాత్మిక బృందం పాల్గొని అన్నమయ్య సంకీర్తనల గీతాలాపన చేశారు. కార్యక్రమంలో సూర్యకుమారి, అన్నపూర్ణ, అనురాధ, వాణిశ్రీ, శ్రీలక్ష్మి, ప్రవీణ, అరుణ పాల్గొన్నారు.

- టెక్కలి

'విధులు బహిష్కరించిన న్యాయవాదులు'



సోంపేట: కోర్టు ఆవరణలో నిరసన తెలియజేస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు



ఇచ్ఛాపురం: కోర్టు ఆవరణలో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

ఇచ్ఛాపురం: ఇటీవల విజయవాడలో న్యాయవాది ఆర్.ఆదిశేషుబాబు హత్యకు గురవ్వడాన్ని న్యాయవాదులు ఖండించారు. ఈ మేరకు స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో విధులు బహిష్కరించి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్.దేవరాజురెడ్డి అధ్వర్యంలో సోమవారం నిరసన తెలిపారు. హత్యకు కారకులైన వారిని ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు ప్రేమలతదేవి, సీతయ్య రెడ్డి, ఎస్ఎల్ఎన్‌రావు, డి.కృష్ణమూర్తి రెడ్డి, రాంబాబు, ఎస్‌వీఎస్ రంగారావు, కామేష్ తదితరులు పాల్గొన్నారు.

సోంపేట: న్యాయవాదులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక రక్షణ చట్టం అమలు చేయాలని సోంపేట బార్ అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. న్యాయవాది హత్యకు నిరసనగా సోంపేట కోర్టుల్లో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సీర నాగభూషణం ఆధ్వర్యంలో సోమవారం విధులు బహిష్కరించి, నిరసన తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు లక్ష్మణరావు, మద్దు సర్వేశ్వరరావు, వజ్జ గోపి, మాదిన సీతారాం, కారు నాయుడు, కామేశ్వరరావు పట్నాయక్ పాల్గొన్నారు.

దేశ నాయకుల విగ్రహాలకు వినతిపత్రాలు




మహాత్మాగాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

టెక్కలి: విద్యుత్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ డివిజన్ కేంద్రమైన టెక్కలిలో దేశ నాయకుల విగ్రహాలకు సోమవారం వినతిపత్రాలను అందజేశారు. ఇటీవల చేపడుతున్న నిరసన కార్యక్రమాల్లో భాగంగా టెక్కలిలో బీఆర్ అంబేడ్కర్, మహాత్మాగాంధీ విగ్రహాలకు వినతిపత్రాలను అందజేసి తమ డిమాండ్లను నినాదాల రూపంలో విన్నవించారు. కార్యక్రమంలో ఎస్.శ్రీనివాసరావు, ఎన్.లోకేశ్వరరావు, డి.శేఖర్, సురేష్‌కుమార్, గోపాల్, సుదర్శనరావు, ఈశ్వరరావు, కరుణాకర్, శ్యామ్యుల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

కాశీబుగ్గ: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పలాస విద్యుత్ డివిజన్ కార్యాలయం ఎదురుగా ఉన్న స్వాతంత్య్ర సమరయోధుడు గౌతు లచ్చన్న విగ్రహం వద్ద ఉద్యోగులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఈఈ ప్రసాదరావు, డీఈఈ కృష్ణమూర్తి, పలాస, కాశీబుగ్గ, మందస ఏఈలు, ఏవోలు భాస్కరరావు, గార రాజారావు, కొమ్మల గిరేశ్వరరావు, హిమగిరి తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: విద్యుత్ శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు గాంధీపార్కు ఆవరణలో గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, జీఎల్ఎంలను గ్రేడ్-2 ఉద్యోగులుగా పదోన్నతి కల్పించాలని కోరారు.

సబ్ కలెక్టర్ స్పందనకు 20 వినతులు



వినతులు స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి

టెక్కలి: స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 20 వినతులు వచ్చినట్లు అధికారులు తెలియజేశారు. కోటబొమ్మాళి మేజర్ పంచాయతీ ప్రభుత్వ స్థలాలు, చెరువుల్లో ఆక్రమణలు తొలగించాలని సర్పంచ్ కె.సంజీవరావు ఫిర్యాదు చేశారు. తనకు దివ్యాంగ పింఛన్ అందజేయాలని ఆదిఆంధ్రావీధికి చెందిన దండాసి దానేషు విన్నవించారు. తమకు ఇంటి స్థలాలు అందజేయాలని కె.జానకమ్మ, బి.నాగవల్లి, కె.శ్రీదేవి, పి.ఇందుమతి తదితరులు విన్నవించారు. కోటబొమ్మాళి మండలం కన్నేవలస గ్రామం సువర్ణ సాగరం చెరువులో ఉన్న ముగురు కాలువ పైపులను తొలగించాలని గ్రామస్తులు విన్నవించారు. సంతబొమ్మాళి మండలం కాశీపురంలో సర్వే నంబరు 12-2 లో గల కోనేరులో ఆక్రమణలు తొలగించాలని వలంటీర్ జనార్ధనరావు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ఏవో బి.రాజమోహన్ ఉన్నారు.

మహిళలకు పెరటి తోట విత్తనాలు



మాట్లాడుతున్న ఏపీఎం గొడబ ప్రసాదరావు

మందస: స్వయం శక్తి సంఘాల మహిళలకు పెరటి తోట విత్తనాలను అందజేస్తున్నట్లు సెర్ప్ ఏపీఎం గొడబ ప్రసాదరావు తెలియజేశారు. స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో రైతు ఉత్పత్తిదారుల సంస్థ బోర్డు ఆఫ్ డైరక్టర్ల సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతు ఉత్పత్తిదారుల సంఘాల్లో సభ్యులకూ ఈ విత్తనాలను పంపిణీ చేస్తామన్నారు. గ్రూపు లీడర్లు ప్రతినెలా సమావేశాలు నిర్వహించాలన్నారు. రాగుల విత్తనాలను ఇప్పటికే పంపిణీ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌పీవో కార్యదర్శి నళిని, కోశాధికారి భానుప్రియ, అకౌంటెంట్ కల్యాణి తదితరులు పాల్గొన్నారు.